సాక్షి
మెదక్

శనివారం । 5 । ఏప్రిల్ । 2025



ఉద్యాన పంటలకు ఊతం

రైతులు ఉద్యాన పంటలు సాగు చేసుకునేందుకు గాను కేంద్రం చేయూతనందిస్తోంది.

వివరాలు 8లో ▸



దూరం పెట్టిందని హత్య

కొంత కాలం సహజీవనం సాగించిన తర్వాత దూరం పెట్టిందని కక్షతో మహిళను దారుణంగా హత్య చేశాడు.

వివరాలు 8లో ▸



సన్నబియ్యం.. పేదలకు వరం

దేశంలో పేదలకు సన్నబియ్యం అందిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే రోహిత్ అన్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి



శ్రీరామనవమి తలంబ్రాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిబ్బంది

పెద్దశంకరంపేట(మెదక్): ఆర్టీసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కార్గో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా కార్గో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఇసాఖ్ అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేట బస్టాండ్‌లో కార్గో సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరామనవమి సందర్భంగా స్వామి వారి తలంబ్రాలు, ముత్యాలను కార్గో ద్వారా ఇంటి వరకు అందిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 20 కార్గో సెంటర్ల ద్వారా ప్రజలకు సేవలందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ శివశంకర్, రీజినల్ కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్, పేట కార్గో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోదాం మేనేజర్ సహా మరో నలుగురు అరెస్ట్

సాక్షి ఎఫెక్ట్

మెదక్‌జోన్: జిల్లా కేంద్రంలోని కేంద్ర గిడ్డంగుల సంస్థ నుంచి బియ్యాన్ని అక్రమంగా తరలించిన ముగ్గురు సిబ్బందితో పాటు వాహన డ్రైవర్, యజమానిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. గత 31వ తేదీన ఎలాంటి అనుమతి లేకుండా సీడబ్ల్యూసీ గోదాం నుంచి 35 క్వింటాళ్ల బియ్యాన్ని ఓ డీసీఎంలో పంపించారు. ఇదే విషయమై ఈనెల 2వ తేదీన సాక్షిలో 'దొంగ చేతికి తాళం' అనే కథనం ప్రచురితం కావడంతో డీసీఎం డ్రైవర్‌తో పాటు దాని యజమానిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారించారు. అయితే గోదాం మేనేజర్, మరో ఇద్దరు సిబ్బంది సహకారంతో బియ్యాన్ని తరలించామని వారు తెలిపారు. గతంలోనూ చాలా సార్లు బియ్యం ఇచ్చినట్లు పోలీసుల విచారణలో చెప్పారు. దీంతో డీసీఎం డ్రైవర్ చందర్, యజమాని సంతోష్‌తో పాటు మేనేజర్ కోటేశ్వర్‌రావు, టెక్నికల్ సిబ్బంది శ్యాం, సునీల్ కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

7 నుంచి లీగల్ లిటరసీ క్యాంపులు

నర్సాపూర్: ఈనెల 7వ తేదీ నుంచి మండలంలో లీగల్ లిటరసీ క్యాంపులు నిర్వహించనున్నట్లు మెదక్ ప్రిన్సిపల్ జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సిరి సౌజన్య తెలిపారు. నారాయణపూర్‌లోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఈనెల 7, నర్సాపూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8, 9న మండలంలోని రెడ్డిపల్లి ఇందిర క్రాంతిపథం గ్రూపు మహిళల కోసం క్యాంపులు నిర్వహిస్తామని ఆమె చెప్పారు.

ఆన్‌లైన్‌లో కొత్త పంచాయతీల వివరాలు

డీపీఓ యాదయ్య



ఆన్‌లైన్‌లో వివరాలను పరిశీలిస్తున్న డీపీఓ యాదయ్య

కొడిపల్లి(నర్సాపూర్): కొత్తగా ఏర్పాటైన గ్రామ పంచాయతీల వివరాలను ఆన్‌లైన్‌లో త్వరగా నమోదు చేయాలని డీపీఓ యాదయ్య కంప్యూటర్ ఆపరేటర్లను ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో కొత్త గ్రామ పంచాయతీల ఆన్‌లైన్ వివరాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కొత్తగా 24 గ్రామ పంచాయతీలు ఏర్పాటైనట్లు తెలిపారు. కాగా పాత పంచాయతీల నుంచి గ్రామ పంచాయతీలకు ఇండ్లు, ఇతర ప్రభుత్వ ప్రదేశాలను వేరుచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు చెప్పారు. కొడిపల్లి మండలంలో ఆరు పంచాయతీలు కొత్తగా ఏర్పాటైనట్లు వివరించారు. నాలుగు పంచాయతీలలో ఆన్‌లైన్ పూర్తి అయిందని, మిగితా రెండు పంచాయతీల వివరాలు సైతం త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు.

మరింత చేరువగా అత్యవసర వైద్యం

- త్వరలో ట్రామా కేంద్రాల ఏర్పాటు
- పేదల కడుపు నింపేందుకే సన్న బియ్యం
- మంత్రి దామోదర రాజనర్సింహ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి దామోదర, ఎమ్మెల్యే సునీతారెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్: వైద్యారోగ్యశాఖలో కొత్త పాలసీని తీసుకొస్తున్నామని, రహదారులపై 35 నుంచి 40 కిలో మీటర్ల దూరంలో ఒక ట్రామా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. శుక్రవారం నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునీతారెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 7,500 ట్రామా కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో అంబులెన్స్‌లు సైతం అందుబాటులో ఉంచుతామన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి అత్యవసర వైద్యం అందించి కాపాడుతామన్నారు. వ్యసనాలతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. పేదల కడుపు నింపడమే తమ ప్రభుత్వ ధ్యేయమని, అందులో భాగంగా రేషన్ దుకాణాల ద్వారా అర్హులైన పేదలకు సన్న బియ్యం అందించే కార్యక్రమం ప్రారంభించినట్లు వివరించారు. మహిళా సాధికారతే ధ్యేయంగా బాలికల విద్యను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. నర్సాపూర్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్, ట్రామా సెంటర్, సీటీస్కాన్ సదుపాయాన్ని త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించడానికి నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. చెక్కుల పంపిణీలో ఆరు నెలల పాటు కాలయాపన జరగడంతో పేదలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా మంత్రి వెళ్లిన అనంతరం ఎమ్మెల్యే సునీతారెడ్డి మైక్ ఇవ్వాలని అడగ్గా అధికారులు ఇవ్వకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి, ఆర్డీఓ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు పంపితే కఠిన చర్యలు



బాధితుడితో మాట్లాడుతున్న మంత్రి దామోదర

తూప్రాన్: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన రోగులను ప్రైవేట్‌కు సిఫార్సు చేస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. శుక్రవారం తూప్రాన్‌లోని సీహెచ్‌సీ నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ దవాఖానాలు తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మరో 80 అంబులెన్స్‌లను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రీజినల్ కేన్సర్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని దృష్టి సారించినట్లు తెలిపారు. తూప్రాన్ ఆసుపత్రిలో ప్రతిరోజు 20 మందికి డయాలసిస్ సేవలు అందించవచ్చని వివరించారు. అనంతరం పట్టణ సమీపంలోని బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

పోటాపోటీ నినాదాలు

డయాలసిస్ సెంటర్ ప్రారంభం సందర్భంగా మంత్రి దామోదర, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి వర్గాలు పోటాపోటీగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. దీంతో కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాల గుర్తించి పలువురు చర్చించుకున్నారు.

రాజకీయాల్లో వ్యక్తిత్వం ముఖ్యం

రాజకీయాల్లో వ్యక్తిత్వం ముఖ్యమని మంత్రి దామోదర అన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తాను, సునీతారెడ్డి మంత్రులుగా కొనసాగామని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకొన్నారు. మహోన్నతమైన వ్యక్తిత్వం వైఎస్సార్ సొంతమని కొనియాడారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ మంచి వ్యక్తిత్వం కలిగి ఉండాలన్నారు. సమన్వయంతో సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడం చాలా ముఖ్యమని అన్నారు.

జీవజాతులను కాపాడుకుందాం

- పర్యావరణంతోనే మానవజాతికి మనుగడ
- సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి

సిద్దిపేటఎడ్యుకేషన్: రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీ ద్వారా జీవజాతులను గుర్తించి పరిరక్షించవచ్చని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ) హైదరాబాద్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. పర్యావరణ సమతుల్యత సమగ్రాభివృద్ధి అనే అంశంపై సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంతరించి పోతున్న జీవజాతులను పరిరక్షించుకోవాలని తద్వారా పర్యావరణం సమతుల్యంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ జీవజాతులను కాపాడుకునేందుకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. వరల్డ్‌వైడ్ లైఫ్ ఫండ్ స్టేట్ డైరెక్టర్ ఫరీదా తంపాల మాట్లాడుతూ పర్యావరణం బాగుంటేనే మానవజాతికి మనుగడ ఉంటుందన్నారు. అన్నామలై యూనివర్సిటీ ప్రొఫెసర్ రామనాథన్ మాట్లాడుతూ నీటి కాలుష్యంతో సముద్రంలోని జీవజాతులకు నష్టం వాటిల్లుతోందన్నారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్లు హరిబాబు, అయోధ్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు కానుక

మెదక్ కలెక్టరేట్: పాడి రైతులకు ఉగాది కానుకగా గేదె పాల ధర పెంచినట్లు డెయిరీ మెదక్ డిప్యూటీ డైరెక్టర్ గోపాల్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెంచిన ధరలు ఈనెల 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చినట్లు తెలిపారు. జిల్లాలోని పాడి రైతులు గేదె పాల దిగుబడులు పెంచి ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. గతంలో 7 శాతం వెన్న కలిగిన గేదె పాలు ప్రతి లీటర్‌కు రూ. 56 ఉండగా ప్రస్తుతం రూ. 59.50 ఇస్తున్నట్లు చెప్పారు. గతంలో 10 శాతం వెన్న కలిగిన గేదె పాలు లీటరకు రూ. 80 ఉండగా ప్రస్తుతం రూ. 84.60 ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆవు పాల ధర తగ్గినట్లు తెలిపారు.

మత్తుకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. వ్యసనంగా మారి నేర ప్రవృత్తి వైపు దారితీస్తుందని అన్నారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు తెలియజేసేందుకు పోలీస్ కళాబృందం ద్వారా కళాజాత ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1908కి లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించిన, తీసుకున్న వారికి కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. సైబర్ నేరాల వల్ల గతేడాది ప్రజలు ఎక్కువ డబ్బులు పోగొట్టుకున్నట్లు తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం

సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ నాగేశ్వరరావు



విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తున్న నాగేశ్వర్‌రావు

మెదక్ కలెక్టరేట్: విద్యుత్ సమస్యలుంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) చైర్మన్ నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ ఎస్ఈ కార్యాలయం వద్ద పరిష్కార వేదిక ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం, లో ఓల్టేజీ, విద్యుత్ మీటర్ సమస్యలు, బిల్లుల్లో సమస్యలు, కొత్త సర్వీస్‌లు, యాజమాన్య బదిలీ, కనెక్షన్ల పునరుద్ధరణ, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ పరిష్కార వేదికలో 105 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదులను 41 రోజుల్లో ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శంకర్, ఇండిపెండెంట్ కమిటీ మెంబర్ వెంకట్, టెక్నికల్ డీఈ శ్రీనివాస్, మెదక్ డీఈ చాంద్‌పాషా, తూప్రాన్ డీఈ గరుత్మంతా రాజు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రికార్డు భద్రంగా ఉండాలి

జెడ్పీ సీఈఓ ఎల్లయ్య



కొడిపల్లి: రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

కొడిపల్లి(నర్సాపూర్)/రామాయంపేట(మెదక్): కొడిపల్లి ఎంపీడీఓ కార్యాలయాన్ని శుక్రవారం జెడ్పీ సీఈఓ ఎల్లయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువవికాసం దరఖాస్తుల గడువు ఈనెల 14 వరకు ప్రభుత్వం పొడిగించిందన్నారు. దరఖాస్తులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వారీగా ప్రత్యేకంగా రిజిస్టర్‌లో నమోదు చేసి భద్రపర్చాలని తెలిపారు. ప్రతి రికార్డు భద్రంగా ఉండాలని సూచించారు. అనంతరం మండలంలో ఉపాధిహామీ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ రంగాచారి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్లా, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రామాయంపేట ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. ఆయన వెంట ఎంపీడీఓ సజీలుద్దీన్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

వన్యప్రాణుల దాహం దాహం



తొనిగండ్ల అటవీ ప్రాంతంలో నీరు లేక ఎండిపోయిన కుంట

- నీటి కోసం పంట చేన్లు, గ్రామాల్లోకి వన్యప్రాణులు
- తాజాగా లక్ష్మాపూర్ వద్ద జింకను హతమార్చిన కుక్కలు



నీరులేక నిరుపయోగంగా సాసర్‌పిట్

రామాయంపేట(మెదక్): వన్యప్రాణులు తాగు నీటి కోసం అల్లాడుతున్నాయి. నీటి కోసం వ్యవసాయ బోర్లు, గ్రామాల్లోకి వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నాయి. తాజాగా శుక్రవారం అటవీ ప్రాంతం నుంచి లక్ష్మాపూర్ గ్రామంలోకి వచ్చిన జింకపై కుక్కలు దాడి చేసి హతమార్చాయి. రామాయంపేట, చేగుంట మండలాల్లో దట్టమైన అటవీప్రాంతం విస్తరించి ఉంది. రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు తాగు నీటి వసతి కల్పనకు గాను 105 సాసర్‌పిట్లతో పాటు 15 చెక్‌డ్యాంలు, 27 చిన్నస్థాయి కుంటలున్నాయి. ఏటా వేసవిలో సాసర్‌పిట్లలో నీరు నింపి వన్యప్రాణుల దాహర్తి తీరుస్తున్నారు. అయితే రెండేళ్లుగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ఆశాఖ అధికారులు నీటి సదుపాయం కల్పించలేకపోతున్నారు. ప్రస్తుతం కొన్ని సాసర్‌పిట్లు పాక్షికంగా ధ్వంసం కాగా రేంజ్ పరిధిలోని నాలుగైదు గ్రామాల్లో మాత్రం ఆశాఖ అధికారులు పంచాయతీ ట్రాక్టర్‌తో సాసర్‌పిట్లలో నీరు పోయిస్తున్నారు. అటవీ ప్రాంతంలో చిరుతలతో పాటు జింకలు, ఎలుగుబంట్లు, అడవి పందులు, రేసుకుక్కలు, మనుబోతులు, ఇతర జంతువులు ఉన్నాయి. రాయిన్‌పల్లి చెరువు అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉండటంతో రాత్రివేళ పదుల సంఖ్యలో జంతువులు చెరువు వద్దకు వెళ్లి తమ దాహార్తిని తీర్చుకుంటున్నాయని అధికారులు చెబుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



రామాయంపేట రేంజ్ పరిధిలోని వన్యప్రాణులకు తాగు నీరు అందించడానికి కృషి చేస్తున్నాం. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో పంచాయతీ వారి సహకారంతో ట్రాక్టర్లలో నీరు నింపుకొని సాసర్‌పిట్లలో పోస్తున్నాం. నీటి ఎద్దడి విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. – విద్యాసాగర్, రామాయంపేట రేంజ్ అధికారి

పనిచేయని సోలార్ మోటార్

దంతేపల్లి అటవీలో వన్యప్రాణులకు తాగు నీటి కోసం బోరు తవ్వించి సోలార్ మోటార్ బిగించారు. అయితే కొద్ది రోజులకే చెడిపోగా, దానికి మరమ్మతులు చేయించడం లేదు. అటవీప్రాంతంలో సాసర్‌పిట్లు, కుంటలు తక్కువ సంఖ్యలో ఉన్నాయి. కాగా మండలంలోని కాట్రియాల అటవీ ప్రాంతంలో సాసర్‌పిట్ల సదుపాయం లేకపోవడంతో తాగునీటి కోసం వన్యప్రాణులు తరచూ గ్రామాలు, పంటచేన్ల వద్దకు వస్తున్నాయి. గతంలో ఈ అటవీ ప్రాంతంలో తాగు నీటి కోసం అల్లాడిపోయిన వన్యప్రాణులు పెద్దసంఖ్యలో మృతిచెందిన సంఘటనలున్నాయి. గతంలో ప్రగతి ధర్మారం అటవీ ప్రాంతంలో తాగు నీరు లభించక 15 నెమళ్లు మృత్యువాత పడ్డాయి. గతేడాది తొనిగండ్ల అటవీప్రాంతంలో ఏర్పాటు చేసిన సోలార్ మోటార్ ద్వారా సమీపంలోని కుంటను నింపుతుండగా వన్యప్రాణులు దాహార్తిని తీర్చుకుంటున్నాయి.



పెద్దాస్పత్రిలో అరకొర వైద్య సేవలు

రోగుల ప్రాణాలతో చెలగాటం!

తప్పనిసరి పరిస్థితిలో 'ప్రైవేట్'కు

సర్కారు వైద్యం గాలిలో దీపం

మెడికల్ కళాశాల మంజూరైన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు మెరుగుపడలేదు. కొందరు వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వచ్చీరాని వైద్యంతో ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది.

– మెదక్‌జోన్

మెదక్ జిల్లా హవేళిఘణాపూర్ మండలం సర్దన గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ గత నెల 5న దాయరవీధిలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. నైట్‌డ్యూటీలో ఉన్న వైద్య సిబ్బంది తుంటి ఎముక విరిగిందని నిర్ధారించారు. ముందుగా యూరిన్ పైపు వేసి చికిత్స ప్రారంభిస్తామన్నారు. అయితే మూత్రనాలంలో పైపు వేసేందుకు అరగంట ప్రయత్నించి విరమించుకున్నారు. ఉదయం మూత్రనాలంలో పైపు వేస్తుండగా రక్తం వస్తుందని వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించాలని కుటుంబ సభ్యులకు చెప్పారు. దీంతో వారు సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, వైద్య పరీక్షలు చేసి మూత్రనాలంలో పైపు సరిగా వేయకపోవటంతో తీవ్రగాయం అయిందని చెప్పారు. ఆపరేషన్ చేసి పైపు ద్వారా యూరిన్ బయటకు తీశారు. అనంతరం విరిగిన ఎముకకు శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం అతడు కోలుకుంటున్నాడు. అయితే మొత్తం ఆస్పత్రి ఖర్చు రూ. 2.50 లక్షలు అయిందని బాధితుడు వాపోయారు. కాగా సదరు ఆస్పత్రి యాజమాన్యం డిశ్చార్జి సమ్మరిలో యూరిన్ పైపు సరిగా వేయకపోవటంతో మూత్రం నాళం లోపల దెబ్బతిందని ఇచ్చారు. అలాగే చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామానికి చెందిన యాదగిరి గత నెల 22న తలకు బలమైన గాయం కావటంతో జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేరారు. సీటీస్కాన్ చేయించుకొని రావాలని డ్యూటీ డాక్టర్ క్షతగాత్రుడి తలకు పట్టి కట్టి పంపించాడు. రక్తం అలాగే కారుతుండడంతో కుటుంబీకులు సదరు వైద్యుడిపై మండిపడగా అప్పుడు కుట్లు వేసినట్లు తెలిసింది.



బాధితుడు అనిల్‌కుమార్

చర్యలు తీసుకుంటాం

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో యూరాలజిస్ట్ లేకపోవడంతో బాధితుడిని గాంధీ ఆస్పత్రికి రెఫర్ చేశాం. అలాగే యూరిన్ పైపు వేసే సమయంలో మూత్రనాలం లోపలి భాగంలో టైట్‌గా ఉండి రక్తం వచ్చింది. ఇది మామూలుగా జరిగే ప్రక్రియ. తలపగిలిన యాదగిరికి రక్తం ఆగటానికి ముందుగా కుట్లు వేశాక సీటీస్కాన్‌కు పంపించాల్సి ఉంది. ఆ రోజు విధుల్లో ఉన్న సదరు వైద్యుడితో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటాం.

– సునీత, ఆస్పత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా

తప్పిపోయిన బాలుడు తల్లి చెంతకు



బాలుడిని తల్లికి అప్పగించిన పోలీసులు

పటాన్‌చెరు టౌన్: తప్పిపోయిన బాలుడిని రెండు గంటల్లోనే తల్లి వద్దకు చేర్చిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నరేష్ కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని మంజీరా కాలనీ శివాలయం రోడ్డుకు చెందిన హనుమంత్ కుమారుడు కృష్ణ (3) శుక్రవారం ఆడుకుంటూ తప్పిపోయాడు. ఒక దగ్గర ఏడ్చుకుంటూ కనిపించడంతో స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు.. బాలుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. వివరాల కోసం ఆరాతీయగా.. బీరంగూడలోని శివాలయం రోడ్డుకు చెందిన హనుమంతు, సునంద దంపతుల కుమారుడు కృష్ణగా గుర్తించారు. బాలుడిని తల్లి సునందకు అప్పగించారు. దీంతో కానిస్టేబుళ్లు స్వప్న, మహేశ్వర్, జయరాజ్‌లకు ఆమెఓ కృతజ్ఞతలు తెలిపింది.

తప్పిపోయిన శిశువు ఎక్కడ?

కొల్చారం/చిలప్‌చెడ్(నర్సాపూర్): తప్పిపోయిన ఆరు నెలల పసికందును అమ్మేశారా.. లేక చంపేశారా అన్న విషయం కొల్చారం, ఇటు చిలప్‌చెడ్ మండలాలలో చర్చనీయాంశంగా మారింది. చిలప్‌చెడ్ మండలం టోప్యా తండాకు చెందిన మహిళను కొల్చారం మండలం సీతారాంతండాకు చెందిన నునావత్ రాజుతో ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. వారికి నాలుగు నెలల పాప ఉంది. భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో జనవరి 20న రాజు ఇంటికి వచ్చే సరికి తల్లికూతుళ్లు కనిపించలేదు. ఈ , విషయాన్ని తన మామకు తెలియజేశాడు. జనవరి 28న కేసు నమోదు చేయడంతో తల్లిని తీసుకొచ్చారు. చిన్నారి గురించి తల్లిని విచారించగా, పొంతన లేని సమాధానాలు ఇస్తుందని పోలీసులు తెలిపారు. కాగా తన భార్య, కూతురు అదృశ్యమైన విషయమై తాను ముందుగానే కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, పోలీసులు తనను విచారణ చేసి కేసు నమోదు చేయలేదని, తన భార్య తండ్రి దీప్ల ఫిర్యాదును కేసుగా నమోదు చేయడం ఏమిటని రాజు అనుమానం వ్యక్తం చేశాడు.

యువకుడి ఆత్మహత్య



నరేశ్

హవేళిఘణాపూర్ (మెదక్): ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. హవేళిఘణాపూర్‌కు చెందిన నరేశ్ (24) కుటుంబ కలహాలతో సతమతమవుతున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన నరేశ్.. ఇంట్లో తలుపులు వేసుకొని దూలానికి ఉరి వేసుకున్నాడు. గమనించిన అతని కుటుంబ సభ్యులు తలుపులు పగులగొట్టి అతన్ని వెంటనే ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

బైండోవర్ ఉల్లంఘనలో జరిమాన

అక్కన్నపేట(హుస్నాబాద్): బైండోవర్ ఉల్లంఘన కేసులో ఇద్దరికి జరిమానా విధించారు. ఈ సంఘటన అక్కన్నపేట మండలం గండిపల్లి గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. హుస్నాబాద్ ఎక్సైజ్ శాఖ సీఐ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోతు భూలి, ఈర్య గతంలో గుడుంబా కేసులో తహసీల్దార్ ఎదుట బైండోవర్ అయ్యారు. ఇటీవల మళ్లీ గుడుంబా తయారీ చేస్తూ పట్టుబడటంతో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘన కింద తహసీల్దార్ అనంతరెడ్డి ఆదేశాల మేరకు ఇద్దరికి రూ.50 వేల చొప్పున జరిమాన విధించారు.

యువకుడి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటరెడ్డి కథనం ప్రకారం.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పద్మారావు కాలనీకి చెందిన వేణు ప్రసాద్ (21) ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 28న బయటకెళ్తున్నానని తన తల్లికి చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ చేసి చూడగా స్విచ్ ఆఫ్ ఉంది. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యాన పంటలకు ఊతం

ప్రోత్సాహం అందించనున్న కేంద్ర ప్రభుత్వం

- ఎంఐడీహెచ్ పథకం కింద జిల్లాకు రూ.10 కోట్లు!
- పండ్లు, పూలతోటలతోపాటు కూరగాయల సాగు లక్ష్యం
- సబ్సిడీపై విత్తనాలు, నారు, సేంద్రియ ఎరువులు అందజేత
- కూరగాయల సమూహం పథకంలో సంగారెడ్డి జిల్లాకు చోటు
- అమల్లోకి వస్తే కష్టాల నుంచి గట్టెక్కనున్న రైతులు



నర్సరీలో పెంచుతున్న కూరగాయల నారు

రైతులు ఉద్యాన పంటలు సాగు చేసుకునేందుకు గాను కేంద్రం చేయూతనందిస్తోంది. ఇందులో భాగంగా సమీకృత ఉద్యాన అభివృద్ధి కార్యక్రమం (మిషన్‌ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్–ఎంఐడీహెచ్) పథకాన్ని అమలు చేసేందుకు నిర్ణయించింది. ఈ పథకం కింద సంగారెడ్డి జిల్లాకు రూ.10 కోట్ల మేర నిధులు వచ్చే అవకాశం ఉంది. కూరగాయలు, పండ్లు, పూలు, సుగంధ ద్రవ్యాల పెంపకమే లక్ష్యంగా రైతులను ప్రోత్సహించనుంది. – జహీరాబాద్

రైతులు కష్టపడి పంటలను సాగు చేస్తున్నా వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడం, పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక అప్పుల పాలవుతున్నారు. దీంతో పంటల సాగు రైతులకు భారంగా మారుతోంది. ఉద్యానవన పంటల సాగు లాభదాయకంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో రైతులు ఉద్యానవన పంటల సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు. రాయితీ పథకాలు అందుబాటులో లేక పోవడంతో సాగుకు ఖర్చులు భారీగా పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఎంఐడీహెచ్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రణాళికను తాజాగా విడుదల చేసింది. ఈ పథకం అమలు కోసం ప్రతిపాదనలు కోరింది. అమలులోకి వచ్చిన నేపథ్యంలో రైతుల కష్టాలు గట్టెక్కే అవకాశం ఉంది.

కూరగాయల సాగు పెంపకమే లక్ష్యంగా



సాగులో ఉన్న టమాట పంట

కూరగాయల సాగు పెంపకమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. గతం కంటే రాష్ట్ర వ్యాప్తంగా అదనంగా 50 వేల ఎకరాల్లో పండ్ల తోటల పెంపకంతో పాటు కూరగాయల తోటల పెంపకం లక్ష్యంగా పెట్టుకుంది. సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం కింద 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్రానికి రూ.145 కోట్లు కేటాయించింది. దీంతోపాటు మెట్రో అర్బన్ వెజిటబుల్ క్లస్టర్ పథకానికి హైదరాబాద్‌ను ఎంపిక చేసింది.

యాంత్రిక పరికరాలు అందజేత

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు గాను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎంఐడీహెచ్ పథకం కింద రూ.145 కోట్లు కేటాయించింది. ఇందులో జిల్లాకు రూ.10 కోట్లు మంజూరు లభించే అవకాశం ఉంది. ఈ పథకం అమలు కోసం కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులను భరిస్తాయి. ఈ నిధులలో నుంచి ఉద్యాన పంటలు వేసుకునే రైతులకు రాయితీ అందించనున్నారు. రాయితీ కింద పండ్ల తోటలు, కూరగాయల విత్తనాలు, కూరగాయల నారు, ఇందు కోసం ఉపయోగించే ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, రోటావేటర్లు, పవర్ వీడర్లు, తైవాన్, హ్యాండ్ స్ప్రేయర్లు, తదితర యాంత్రిక పరికరాలు అందించనున్నారు. సాగుకు రాయితీ అందితే పెట్టుబడులు ఖర్చు తగ్గనుంది. దీంతో ఉద్యానవన పంటల సాగుకు రైతులు ముందుకొచ్చే అవకాశం ఉంది.

జిల్లాకు దక్కిన చోటు

మెట్రో నగరాల్లో కూరగాయల కొరతను తీర్చేందుకు గాను కేంద్ర ప్రభుత్వం కూరగాయల సాగును పెద్ద ఎత్తున పెంచేందుకు నిర్ణయించింది. ఇందు కోసం రూ.2 వేల కోట్ల నిధులను కూరగాయల సమూహాల పథకం(మెట్రో అర్బన్ వెజిటేబుల్ క్లస్టర్ల) ప్రారంభించింది. ఇందులో హైదరాబాద్ నగరం ఉండడంతో నగరానికి వంద కిలోమీటర్ల వరకు ఉన్న ప్రాంతాల్లో కూరగాయలను పెంచాలనే యోచనతో ఉంది. దీంతో సంగారెడ్డి జిల్లాను ఇందులో చేర్చారు. సంగారెడ్డి జిల్లాతో పాటు దగ్గరలో ఉన్న వికారాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ, నిజామాబాద్, వరంగల్ జిల్లాలకు కూరగాయల సమూహాల పథకం వర్తిస్తుంది. దీని కింద కూరగాయల సాగుకు రైతులు, రైతు సమూహాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘలను ప్రోత్సహిస్తారు. అవసరం అయితే కూరగాయల విత్తనాలు, నారు, సేంద్రియ ఎరువులు సబ్సిడీపై అందిస్తారు.

నిధులు రాగానే పథకం అమలు



ఎంఐడీహెచ్ పథకం కింద ఇంకా జిల్లాకు నిధులు రాలేదు. ఆ నిధులు రాగానే రైతులకు అవసరమైనవి అందిస్తాం. రైతులకు విత్తనాలు, నారు, షేడ్ నెట్, మల్చింగ్, టమాట క్రేట్లు, ఎరువులు సబ్సిడీపై అందించేందుకు వీలు పడుతుంది. గతేడాది కాలంలో రూ.1.03 కోట్ల నిధులతో జిల్లాలోని రైతులకు పలు పథకాలను అందిచాం.

–సోమేశ్వర్‌రావు, జిల్లా ఉద్యానవన అధికారి, సంగారెడ్డి

కేబుల్ వైర్ల దొంగ పట్టివేత



కేబుల్ వైర్లతో భూమయ్య

కొల్చారం(నర్సాపూర్): బోరు బావుల దగ్గర నుంచి కేబుల్ వైర్లను కట్ చేసి ఎత్తుకెళ్తున్న దొంగను పట్టుకొని, పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన మండలంలోని ఎనగండ్ల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. చిలప్‌చెడ్ మండలం గౌతాపురం గ్రామానికి చెందిన నదరి భూమయ్య జల్సాలకు అలవాటుపడి వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్లను దొంగిలించి, వాటిని అమ్ముకుంటున్నాడు. ఉదయం గ్రామ శివారులోని రక్షిత మంచినీటి బోరు వద్దగల కేబుల్ వైరును దొంగిలిస్తుండగా పట్టుకున్నారు. కేబుల్ వైర్ల దొంగతనం విషయమై భూమయ్యను రైతులు విచారించగా.. చుట్టుపక్కల గ్రామాల్లో సైతం కేబుల్ వైర్లు దొంగతనం చేసినట్లు, దుంపలకుంట చౌరస్తాలో గల ఓ ఇంజనీరింగ్ దుకాణంలో వాటిని అమ్ముతున్నట్లు ఒప్పుకున్నాడు. దీంతో అతన్ని పోలీసులకు అప్పగించారు.

యువకుడి రిమాండ్

మిరుదొడ్డి(దుబ్బాక): అశ్లీల వీడియోను సోషల్ మీడియాలో ఫార్వార్డ్ చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేసినట్లు దుబ్బాక సీఐ శ్రీనివాస్ తెలిపారు. మిరుదొడ్డి మండలం లక్ష్మీనగర్‌కు చెందిన పుట్ట అనిల్ కొన్ని రోజుల క్రితం తన ఫోన్ ద్వారా అశ్లీల వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నాడు. సైబర్ సెక్యూరిటీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్, సిమ్‌కార్డు, డీవీడీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రవీణ్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సంగారెడ్డి ఫసల్వాది గ్రామానికి చెందిన బైండ్ల ప్రవీణ్ (21) పటాన్‌చెరు మండలం రుద్రారం పరిధిలోని తోషిబా కంపెనీలో పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం తన స్నేహితుడు ఇమ్రాన్‌తో కలిసి కంపెనీలో తనకు వచ్చే డబ్బులు తీసుకోవడానికి వెళ్లాడు. అక్కడి నుంచి పాశమైలారానికి ఇద్దరు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా.. రుద్రారం శివారులో పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం వీరిని ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందగా, ఇమ్రాన్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. ప్రవీణ్‌కు సంవత్సరం క్రితమే వివాహం జరిగిందని, ప్రస్తుతం అతడి భార్య గర్భవతి అని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

నిజామాబాద్ వాసి మృతి

రామాయంపేట(మెదక్): రామాయంపేట పట్టణ శివారులో జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన దేవన్‌పల్లి సాకేత్ (19) మృతి చెందాడు. సాకేత్ తన స్నేహితుడు శివతో కలసి స్కూటీపై హైదరాబాద్ వెళుతుండగా, రామాయంపేట శివారులో ప్రమాదానికి గురయ్యారు. వారు ప్రయాణిస్తున్న వాహనాన్ని వెనుక నుంచి ఢీకొనగా, తలకు తీవ్ర గాయాలవడంతో సాకేత్ అక్కడికక్కడే మృతి చెందగా, శివ తీవ్రంగా గాయపడ్డాడు. సాకేత్ హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్నాడు. మృతుని తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దూరం పెట్టిందని మట్టుబెట్టాడు

- మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు.. నిందితుడి అరెస్టు
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, వెనకాల నిందితుడు రమేష్

జహీరాబాద్ టౌన్: కొంత కాలం సహజీవనం సాగించిన తర్వాత దూరం పెట్టిందని కక్షతో మహిళను దారుణంగా హత్య చేశాడు. ఈ కేసులో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. శుక్రవారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఝరాసంగం మండలం చిలేమామిడికి చెందిన లక్ష్మి(40)కి భర్త లేడు, ఉపాధి కోసం పట్టణానికి వచ్చి పస్తాపూర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. కోహీర్ మండలం గొటిగార్‌పల్లికి చెందిన సత్యారం రమేష్(26)కు ఆమెతో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి రెండేళ్ల నుంచి సహజీవనం చేస్తున్నారు. రమేష్ ప్రవర్తన నచ్చక దూరం పెట్టింది. అప్పటి నుంచి ఆమెపై కక్ష పెంచుకున్నాడు. తనను దూరం పెట్టి మరొకడితో ఉంటుందన్న కోపంతో ఆమెను హత్య చేయాలని నిర్ణయించాడు. మార్చి 29న రమేష్ కల్లుతాగి లక్ష్మికి ఇంటికి వెళ్లాడు. వెంట తెచ్చుకున్న పెంట్రోల్‌ను పోసి నిప్పు పెట్టాలని చూశాడు. గట్టిగా కేకలు వేయడంతో పక్కింటి మహిళ మరియమ్మ పరుగెత్తుకుంటూ రావడంతో అక్కడి నుంచి పారిపోయాడు. అదేనెల 31న ఉదయం రమేష్ మళ్లీ ఆమె ఇంటికి వెళ్లి బలవంతం చేయడానికి ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో కళ్లలో కారం చల్లి గ్యాస్ సిలిండర్ తీసుకుని తలపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం మృతురాలి సెల్‌ఫోన్ తీసుకుని పరారయ్యాడు. శుక్రవారం హైదరాబాద్ పారిపోవడానికి ఆర్టీసీ బస్టాండ్‌కు రాగా నిందితుడిని అరెస్టు చేశామని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని కోర్టులో రిమాండ్ చేశామన్నారు. నిందితుడిని సకాలంలో పట్టుకున్న సీఐ.శివలింగం, ఎస్ఐ.కాశీనాథ్, పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తేనే...

- లేదంటే ఎక్కడి గొంగళి అక్కడే...
- సమస్యలను నేరుగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తున్న స్థానికులు
- తలలు పట్టుకుంటున్న అధికారులు



నీటిని నిల్వ గుంతను ధ్వంసం చేస్తున్న అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజా సమస్యలను స్థానికులు అనేకసార్లు స్థానిక అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన వారు పట్టించుకున్న పాపానపోవడంలేదు. ఇక చేసేదేమీ లేక ఆ సమస్యలను నేరుగా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తున్నారు. వెంటనే తన దృష్టికి ప్రజలు తీసుకొచ్చిన సమస్యలపై కలెక్టర్ స్పందించడంతోపాటు అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని అనేక సమస్యలు కలెక్టర్ పుణ్యమంటూ పరిష్కారమయ్యాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ దృష్టికి వచ్చిన సమస్యలపై స్థానిక అధికారులను వివరణ కోరడంతోపాటు వాటిని వెంటనే పరిష్కారించాలని ఆదేశిస్తుండటంతో స్థానిక అధికారులు ఆగమేఘాలమీద చర్యలు తీసుకుంటున్నారు. గతేడాది తెల్లాపూర్ పరిధిలో జోరుగా నీటి దందా జరగడంతో దీనిని అరికట్టాలని స్థానికులు అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు పట్టించుకోకపోవటంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో రాత్రికి రాత్రే అధికారులు నీటి ట్యాంకర్లను సీజ్ చేశారు. తిరిగి కొద్ది రోజులుగా తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో జోరుగా నీటి దందా మొదలైంది. దీనిని నియంత్రించాలని అధికారులను కోరినా వారు పట్టించుకోకపోవడంతో జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకునిపోవడంతో అధికారులలో తిరిగి చలనం వచ్చింది. అక్రమ నిర్మాణాలపై సైతం అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో నేరుగా కలెక్టర్ దృష్టికే తీసుకునిపోతున్నారు.



నుజ్జునుజ్జయిన డీసీఎం ముందు భాగం

కంటైనర్‌ను ఢీకొన్న డీసీఎం

ఇరుక్కుపోయిన డ్రైవర్.. తీవ్ర గాయాలు

తూప్రాన్: ముందు వెళుతున్న కంటైనర్‌ను వెనకాల నుంచి డీసీఎం ఢీకొనడంతో డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. ఈ సంఘటన 44వ జాతీయ రహదారిపై మాసాయిపేట స్టేషన్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్ లారీని వెనకాల నుంచి డీసీఎం అతివేగంగా ఢీకొంది. ఈ ఘటనలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన డీసీఎం డ్రైవర్ కబ్రేజ్ క్యాబిన్ లోనే ఇరుక్కుపోయాడు. కుడికాలు నుజ్జునుజ్జయింది. జీఎమ్మార్ హైవే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రున్ని బయటకు తీసి గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా హైవేపై వాహనాలు స్తంభించి పోయాయి.

హాస్టల్ విద్యార్థి అదృశ్యం

- 15 రోజుల తర్వాత ఆలస్యంగా వెలుగులోకి..
- హాస్టల్ ఎదుట విద్యార్థి తల్లిదండ్రుల ధర్నా



మెగావత్ కుమార్(ఫైల్)



విద్యార్థులతో కలిసి హాస్టల్ గేటు ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి తల్లిదండ్రులు, నాయకులు

వట్‌పల్లి(అందోల్): సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం దేవునూరు బాలుర హాస్టల్ నుంచి ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. పక్షం రోజుల క్రితం జరిగిన ఈ ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. మండల పరిధిలోని పెద్దతండాకు చెందిన మెగావత్ కుమార్(15) దేవునూరు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతూ.. అదే గ్రామంలో ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఉంటున్నాడు. గత నెల మార్చి 20న కుమార్ పాఠశాలకు హాజరుకాగా.. అదే రోజున సాయంత్రం హాస్టల్ నుంచి వెళ్లిపోయాడని సహచర విద్యార్థులు చెబుతున్నారు. ఉగాది పండుగ సందర్భంగా అదే తండాకు చెందిన పలువురు విద్యార్థులు హాస్టల్ నుంచి ఇళ్లకు వెళ్లిపోగా..తమ కుమారుడు రాలేదని కుమార్ తల్లిదండ్రులు వార్డెన్‌కు ఫోన్ చేసి ఆరా తీశారు. అయితే.. కుమార్ ఇంటికి వెళ్లినట్లు వార్డెన్ సమాధానం చెప్పడంతో తల్లిదండ్రులు కంగుతిన్నారు. వార్డెన్‌ను నిలదీశారు. అనంతరం వారు శుక్రవారం వట్‌పల్లి పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ సుధాకర్ వివరాలు సేకరించే క్రమంలో మార్చి 29 వరకు విద్యార్థి హాస్టల్‌లో ఉన్నాడని, తర్వాత కనపించలేదని వార్డెన్ చెప్పే మాటలకు, స్కూల్ రిజిస్టర్‌లో మార్చి 20 వరకు మాత్రమే విద్యార్థి హాజరైనట్లుగా నమోదై ఉంది. వార్డెన్ మాటలకు పొంతన లేకపోవడంతో విద్యార్థి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డెన్ తీరును నిరసిస్తూ విద్యార్థులతో కలిసి హాస్టల్ గేటు ఎదుట బైఠాయించారు. విషయం తెలిసిన జోగిపేట సీఐ అనిల్‌కుమార్ విచారణ చేపట్టారు. విద్యార్థి తల్లి లక్ష్మీబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డంప్‌యార్డును పరిశీలించిన డీపీఓ



కంది డంప్ యార్డును పరిశీలిస్తున్న డీపీఓ సాయి బాబ

కంది(సంగారెడ్డి): మండల కేంద్రమైన కంది శివారులో గల డంప్‌యార్డును శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) సాయిబాబ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...శనివారం నుంచి జేసీబీలతో జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం ప్రక్కన పేరుకు పోయిన చెత్తను ప్రస్తుతం ఉన్న షెడ్డు వద్దకు తరలించాలని సూచించారు. షెడ్డును పూర్తిస్థాయిలో వినియోగించుకుని చెత్తశుద్ధి యంత్రంతో వర్మీ కంపోస్ట్ తయారు చేయాలన్నారు. అలాగే తడి, పొడి చెత్తను వేరు చేసి ఇచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీయల్పీవోఅనిత, ఎంపీవో మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గంధమే శ్వాసగా... సాగిపోవాలిక్కడ

జాతీయ రహదారి పక్కనే చెత్త డంపింగ్

- కుప్పలు కుప్పలుగా వ్యర్థ పదార్థాలు
- ఇష్టానుసారంగా వదిలేస్తున్న వైనం
- రహదారుల పక్కన వెదజల్లుతున్న దుర్వాసన
- పట్టించుకోని అధికారులు



జాతీయ రహదారి పక్కన వ్యర్థాలు

సంగారెడ్డి జోన్: ప్రధాన జాతీయ రహదారికి ఇరువైపులా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణంతో ఉండాల్సిన పరిసరాలు అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ, పట్టింపు లేనితనంతో రోడ్డు పక్కన ఇష్టారాజ్యంగా చెత్తను డంపింగ్ చేస్తున్నారు. చెత్తను, వ్యర్థాలను పారేయడంతో రాకపోకలు సాగించేవారు దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డున వెళ్లాలంటే 'సాహసం శ్వాసగా చేసుకుని'ప్రయాణించాలని వ్యంగ్యంగా చెబుతున్నారు.

చెత్త కుప్పలు.... వ్యర్థ పదార్థాలు

హైదరాబాద్ నుంచి ముంబై వెళ్లే ప్రధాన జాతీయ రహదారి 65 జిల్లా కేంద్రం సంగారెడ్డి పట్టణం మీదుగా వెళ్తుంది. రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సంగారెడ్డి పట్టణం నుంచి జహీరాబాద్ వెళ్లే రహదారి పక్కన పచ్చని చెట్ల కింద చెత్తను కుప్పలు కుప్పలుగా పారబోస్తున్నారు. అంతే కాకుండా వృథాగా మిగిలిన కూరగాయలు, వివిధ రకాల పండ్లు ఇష్టానుసారంగా వదిలేస్తున్నారు. సంచులలో నింపి పారేసి వెళ్తున్నారు. సంగారెడ్డి నుంచి హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో సంగారెడ్డి శివారులో రోడ్డు పక్కన ప్లాస్టిక్ కాగితాలు చెత్త విచ్చలవిడిగా కనిపిస్తుంటాయి. దీంతో రహదారుల పక్కన డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్నాయి.

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

రహదారులకు ఇరువైపులా చెత్తకుప్పలను వేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బలమైన గాలులు వీచిన సమయంలో చెత్త కుప్పలో నుంచి ప్లాస్టిక్ కాగితాలు, చెత్తాచెదారం రహదారుల పైకి వస్తోంది. చెత్తకుప్పలకు మంట పెట్టిన సమయంలో వచ్చే పొగతో ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు చెబుతున్నారు. ఫలితంగా వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తీవ్రస్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు.

మూగజీవాలకు సైతం ఇబ్బందులు

చెత్త వేసిన ప్రాంతాలలో పశువులు సంచరించడంతో వాటికి సైతం ఇబ్బందులు తప్పడం లేదు. కుళ్లిన వ్యర్థాలు తినడంతో రోగాల బారిన పడే అవకాశం ఉంది. రహదారులకు ఇరువైపులా చెత్తను వేయకుండా చూడాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన కనీసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు చెబుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు చెత్తను పారబోయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. చెత్తను ఇష్టానుసారంగా పారబోస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటున్నారు.

వెదజల్లుతున్న దుర్వాసన

వివిధ రకాల కూరగాయలు, పండ్లు ఇతర రకాల వ్యర్థాలను ఇష్టానుసారంగా పారేస్తున్నారు. కొన్ని రోజులపాటు అక్కడే ఉండటంతో కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. తోడుగా కురిసిన వర్షం నీటికి మరింతగా భరించలేని కంపు కొడుతోంది. దీంతో అటువైపుగా రాకపోకలు సాగించే వాహనదారులు దుర్వాసనకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. అంతేకాకుండా పలు సందర్భాలలో చెత్తను కుప్పలుగా వేసి తగలబెడుతున్నారు. వృక్షాలుగా మారిన మొక్కలు కాలిపోతున్నాయి.